వలననే శాంతమువహించినది. నీవుతప్ప దిక్కులేదు. రాత్రియంతయు మాతోడనుండు మూఁడవవాఁడవు నీవె" పైననక్షత్రములు మిణుకుమనెను. నీరుచప్పుడుచేసెను. గాలి చెంపలనుండి ముంగురుల కదల్చెను. తెడ్లు పడెను. పడవకదిలెను. అలలులేవు. పరమశాంతము. నీటిచారలో కదలు నక్షత్రకాంతి. నీటిపై గాలి. సన్నసిరోదనము. ఎటుచూచిన జలము. అంధ కారము. ఆకసము సముద్రము. ఒక జేనెఁడుకొయ్యపడవమాత్ర మాధా రము. పైన ఉన్నతము. క్రిందనగాధము. చలి. ఒడ్డుకానరాదు. ఎరుగు దురు? ఎటుపోవుదురు ? గతియేమి ?

నాకు మెలఁకువవచ్చెను.

గుడిపాటి వెంకటాచలం,

అనసూయ మాసపత్రిక,

ఫిబ్రవరి 1919

★

# యేం తప్పు?

ఛీ. తప్పేమిటి ?

యిట్లారా

చీకటి వెలుతురుతో మెరుగుపట్టినట్లు, నీ జుట్టుమీద చెయ్యేసి, నీ సన్నని, తెల్లని, మెత్తని చెంపల్ని తాకడం తప్పా ?

దీకట్లో మలయమారుతం మీద తేలే మబ్బుకి, వెలుతురు వొకపక్క మెరుగుపెడితే, దాన్ని తాకాలనుకోవడం తప్పా ?

యెందుకూ నవ్వుతావు ? నా మాటలకేనా ? నీ ముఖమును వెలిగించి, అదృశ్యమయ్యే ఆ చిరునవ్వును నా ముద్దులతో అట్లానే, యెర్రని పెదిమలమీద ఆపనా ?

అది తప్పే ? యేం ?

అస్తమించే సూర్యుడు యెర్రచేసిన మబ్బులోంచి కనపడే, అర్ధ చంద్రుణ్ణి, అక్కడే ఆపి ఆ సౌందర్య మనుభవించాలనుకుంటే తప్పా ?

యిట్లారా.

లోకపు నిందలతో, చివాట్లతో, అలిసి, దిమ్మెక్కిన యీ తలని, నీమీద ఆనించుకొని పరవశత్వము నొందనీ !

తప్పంటావా ?

ప్రేమ జలభారంతో బరువెక్కి వొంపుతీరిన ధవళారుణ పయోధరము మీద వొకసారి తలనానించు కొందా మని కోర్కెపడడం తప్పేనా ?

వెడుతున్నావేం ? పోనీను. యెందుకు తప్పో చెప్పి మరీ కదులు.

పోకుండా, నా రెండు చేతులతో నీమృదు శరీరాన్ని నలిగిపొయ్యేట్టు కావిలించుకొని, అట్టి పెట్టేసుకుంటాను.

యిది తప్పులేదు.

పరిగెత్తే, తెల్లని, మెత్తని, వెన్నవంటి, బూరుగ దూదివంటి కార్తీక మబ్బును కావిలించుకుని, చల్లగాలి వీచే మర్రిచెట్టు నీడలోకి తెచ్చుకుందా మనుకోడం ఏమీ తప్పులేదు, నాకు తెలును.

ఏదీ మొహం ? తిప్పివేశావేం? ఇట్లా తిప్పుకుంటాను. కళ్ళల్లో నీరే ! ఎందుకు ?

పోనీ గాని, ఆనీరు నా పెదిమలతో తుడిచి, ఆ మెరిసే పాపల్లో అనంతమైన సౌందర్య స్వర్గాన్ని చూడనీ !

దీంటో తప్పేముంది ?

కాంతులు చిమ్మే శుక్రుడిమీద చిరుమబ్బు కమ్మితే దాన్ని తుడిచి ధగధగ మనే నా కోర్కెవలె మండే, ఆ ప్రేమలోకపు కాంతిని అనిమిషుడనై చూడ్డానికి ఆశపడడం తప్పుకాదు.

ఛీ ! తప్పు కానేకాదు.

తల పైకెత్తి నీలాంబరాన స్వచ్ఛందంగా గాలిలో విహరించే మేఘాలను చూడలేని అర్ధాంధులకు తప్పు మన కేమి తప్పు ?

నక్షత్రాల మధ్య వుండే అగాధమైన లోతుల, గాధమైన అంతాన్ని స్పృశించే అమరత్వం పొందిన నీకూ నాకూ తప్పేమిటి ?

ఛీ పిచ్చి ఇంకా నీకు.

ఈ నీతి లోకపు వాసనలు పోలేదా ?

ఎంత తప్పు ?

★

# రుషులూ-యోగులూ

పూర్వకాలం రుషులూ, యోగులూ, కావడం, చాలా సుఖంగా వున్నట్టు కనపడుతుంది; యోగ్యతవుండాలిగాని, చిన్నతనంలో గురువు ఆశ్రమంలో భోజనమూ అదీ జరిగిపోయేది తరవాత సొంత రిసర్చికోసం ఆశ్రమాలు స్థాపించుకునేవారు, ఈ శిష్యులు గురువులుగా తయారై.